## గౌ॥ ముఖ్యమంత్రిగారే చొరవ తీసికొని రాష్ట్రపతి ఉత్తర్వులు తెప్పించాలి!
## ఏకీకృత సర్వీసు రూల్స్ విడుదల చేసి పదోన్నతులు కల్పించాలి!
## తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి డిమాండ్
## ఏప్రియల్ 20న కలెక్టరేట్స్ ఎదుట ధర్నాలు

**మిత్రులారా!**

ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యల పరిష్కారం నిర్లక్ష్యానికి గురైయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక మన ఉద్యమాల ద్వారా ఏర్పడ్డ క్రొత్త ప్రభుత్వం విద్యారంగ సమస్యలలో ముఖ్యంగా కామన్ సీనియారిటీ సమస్యకు పరిష్కారం చూపి విద్యా పాలన, విద్యాబోధనను బలోపేతం చేస్తుందని ఆశించాము. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోంశాఖతో మాట్లాడి పరిష్కరించ వచ్చు, కానీ సంవత్సరాల తరబడి దాటవేసారు. నేటి వరకు ఆ ప్రయత్నాలు ఫలించకపోవడం కృషి లోపమా? చిత్తశుద్ధి లేకపోవడమా? అర్థం కాని పరిస్థితి.

ప్రభుత్వం విద్యారంగం పట్ల చూపుతున్న సవతి తల్లి ప్రేమ, విద్యా పాలనలో, పాఠశాల విద్యను పర్యవేక్షించాల్సిన ఉపవిద్యాధికారి, మండల విద్యాధికారి పోస్టులు నింపే ప్రయత్నాలు చేయకపోవడం, ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చే డైట్ కళాశాలలలో అధ్యాపకులు లేకపోవడంతో 2016-17 విద్యాసంవత్సరం నందు డైట్‌లో మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు అడ్మిషన్లే ఇవ్వని పరిస్థితి. చివరకు ఉన్నత పాఠశాలలను నడపవలసిన ప్రధానోపాధ్యాయుల పోస్టులు నింపకుండా, ఏళ్ళ తరుబడి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పోరాట ఫలితంగా భాషా పండితులు, పి.ఇ.టీలను అప్‌గ్రేడ్ చేస్తూ జి.వో. 17, 18లు విడుదల చేసినా నేటికి పాఠశాలల వారిగా కేటాయించలేదు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్య రోజు రోజుకు ప్రజాదరణ కోల్పోతుండగా, ప్రైవేటు విద్యా వ్యవస్థ బలోపేతం అవుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వమే రాష్ట్ర శాసన సభలో సమర్పించిన నివేదిక మేరకు 552 మండల విద్యాధికారుల పోస్టులలో 508, 56 ఉపవిద్యాధికారి పోస్టులలో 44 పోస్టులు, డైట్ మరియు బియిడి కళాశాలలో 90%పైననే పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయుటకు పాఠశాల విద్య నుండి ప్రమోషన్స్ లేకుండా జీ.వో. 223 ద్వారా అడ్డుకట్టవేసారు. కళాశాల విద్యాశాఖలో పనిచేసే విద్యా బోధనలో ఏలాంటి అనుభవం లేని బోధనేతర సిబ్బందికి ప్రమోషన్ పొందే అవకాశం కల్పించి ఉపాధ్యాయులకు ప్రమోషన్లను నిరాకరించడం శోచనీయం. విద్యార్హతలుండి అనుభవం ఉన్న ఉపాధ్యాయులందరికీ జూనియర్ లెక్చరర్‌లుగా పదోన్నతులు పొందే విధంగా ఉత్తర్వులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

కామన్ సీనియారిటీ సమస్యపై భారత అత్యున్నత న్యాయ స్థానం 30-9-2015న తీర్పునిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని పేరా 8 ప్రకారం ప్రొవిన్షలైజ్ అయిన పంచాయితీరాజ్ ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఉద్యోగులే కనుక ఈ పోస్టులను లోకల్ క్యాడరుగా ఆర్గనైజ్ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు భారత పార్లమెంట్

ఆమోదించిన విభజన చట్టంలో కూడా 371(డి)ని ప్రస్తావిస్తూ క్రొత్తగా ఏర్పడిన రెండు రాష్ట్రాలకు సంబంధించి లోకల్ క్యాడర్ ఆర్గనైజ్ చేసికోవచ్చు అనే సూచన కూడా చేసింది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో 15 అక్టోబర్ 2015న ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనాటి పాఠశాల విద్యా కమిషనర్ గారు పాల్గొని సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. విద్యా శాఖామంత్రిగారిని కలిసి ప్రాతినిధ్యం చేయగా సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని హామీనిచ్చారు. తేది 10 ఫిబ్రవరి 2016నాడు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీతో విద్యాశాఖ మంత్రిగారు జరిపిన చర్చలలో సర్వీసు రూల్స్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక అధికారినిని నియమిస్తానని, జె.ఎల్.ప్రమోషన్సు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అయినప్పటికి "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు" నేటికి కామన్ సీనియారిటీ సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదు. పదోన్నతులు చేపట్టడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2016 నుండి క్రొత్త జిల్లాలు ఏర్పాటు చేసింది. జిల్లాలు ఏర్పడినప్పటికీ ఉపాధ్యాయులు ఎక్కడివారు అక్కడే పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులు వారి వారి స్థానిక జిల్లాలో పనిచేయుటకు వీలుగా, భార్యా/భర్తలను ఒకే చోటికి, లోకల్ క్యాడరు మేరకు స్వంత జిల్లాలకు బదిలీ చేయవలసిన అవసరం ఉంది. బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలి.

రాష్ట్రపతి ఉత్తర్వులు తెప్పించి కామన్ సర్వీసు రూల్స్ ప్రకారం పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ప్రాతినిధ్యాలు చేసింది. అధికారుల దృష్టికి తీసికొని వెళ్ళింది. అయినా ఏ విధమైన ఫలితం కన్పించలేదు. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణకై గౌరవ ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్ళి ప్రత్యేక శ్రద్ధతో చేస్తే తప్ప వేరే అవకాశము కన్పించుట లేదు. ఈ సమస్య పరిష్కారముతో బదిలీలు, పదోన్నతులు ముడిపడి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ **తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రియల్ 20వ తేదీన అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు** విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

**పరిష్కరించవలసిన సమస్యలు:**

1. రాష్ట్రపతి ఉత్తర్వులు తెప్పించి, 2017 ఏప్రిల్ 30లోగా ప్రభుత్వ, జిల్లాపరిషత్ మరియు మండల పరిషత్ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ జారీచేయాలి. మే నెలలో పదోన్నతులు మరియు బదిలీలు పూర్తి చేయాలి.
2. జిఓ. 223 ఉన్నత విద్య తేది 18.9.2008ని రద్దు చేసి, పాఠశాల విద్యలో పని చేయుచున్న స్కూలు అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలి.
3. కౌన్సిలింగ్ విధానాన్ని భంగపరిచే సెక్రటేరియట్ బదిలీలు చేయరాదు.

**తేది: 06-04-2017**
స్థలం:హైదరాబాదు.

**ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ**

**TSUTF, TPTF, DTF, STF, TSPTA, DGTU, BTF, TUTA, TSCSTTA, TGPETA**